క్లుప్తంగా

వైభవంగా శ్రీ వీరమ్మ పేరంటాళ్లు గ్రామోత్సవం



పెదకాకాని: శ్రీ వీరమ్మ పేరంటాళ్లు తిరునాళ్ల పురస్కరించుకుని గ్రామోత్సవం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 20న అమ్మవారు ఆలయం నుంచి ప్రత్యేకంగా అలంకరింపబడిన ట్రాక్టర్‌పై బయలుదేరి తక్కెళ్లపాడు చేరుకుంది. అక్కడ గ్రామోత్సవం అనంతరం తిరిగి రాత్రికి వెనిగండ్లకు చేరుకుంది. గురువారం వెనిగండ్ల పురవీధుల్లో కొమ్ము వాయిద్యాలు, డప్పుల మోత నడుమ గ్రామోత్సవం రాత్రికి పెదకాకానికి చేరుకుంది. భక్తులు అమ్మవారికి బిందెలతో నీరు వారు పోశారు. పూలు, పండ్లు, కొబ్బరికాయలు, పసుపు కుంకుమలు సమర్పించి భక్తిశ్రద్ధలను చాటుకున్నారు. ఈనెల 25న సిడిమాను ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు గ్రూపు టెంపుల్స్ ఈఓ కోటేశ్వరరావు తెలియజేశారు.

పాఠశాల అభివృద్ధికి సహకారం అభినందనీయం



ప్రత్తిపాడు: పాఠశాల అభివృద్ధికి గ్రామస్తుల సహకారం అభినందనీయమని గుంటూరు ఉర్దూ డీఐ ఎండీ. ఖాసిం అన్నారు. వట్టిచెరుకూరు మండలం పుల్లడిగుంటలోని ప్రభుత్వ ఉర్దూ ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులతో పాటు విద్యార్థుల నైపుణ్యాల్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల ఆవరణలో గ్రామస్తుల సహకారంతో రేకుల షెడ్డు నిర్మించడం ప్రశంసనీయమన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత, ఆహార పదార్థాల రుచిని విద్యార్థులతో కలిసి భోజనం చేసి పరిశీలించారు. ఆహార పదార్థాల నాణ్యతలో రాజీ వద్దని, పక్కాగా ఉండాలని ప్రధానోపాధ్యాయునికి సూచించారు. ఆయన వెంట పాఠశాల ఉపాధ్యాయులు ఇర్షాద్ బేగ్, సమీనా అక్తర్, గ్రామస్తులు ఉన్నారు.

25న గొట్టిపాడులో ఉచిత నేత్ర వైద్య శిబిరం

పెదగొట్టిపాడు (ప్రత్తిపాడు): మండల పరిధిలోని పెదగొట్టిపాడులో ఈ నెల 25న ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ మాజీ ప్రెసిడెంట్ పచ్చల శ్రీనివాసరావు తెలిపారు. స్థానిక హిందూ ఎలిమెంటరీ ప్రాథమిక పాఠశాలలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర కంటి ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహిస్తున్న శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. శిబిరానికి హాజరయ్యే వారు ఆధార్, ఆరోగ్యశ్రీ కార్డు లేదా ఓటరు గుర్తింపు కార్డుల ఫొటోస్టాట్ కాపీలతో పాటు కుటుంబ సభ్యుల మొబైల్ నంబరును కూడా తెచ్చుకోవాలని సూచించారు.

నేటి నుంచి విశ్వయోగి విశ్వంజీ జన్మదిన వేడుకలు

ప్రత్తిపాడు: మండల పరిధిలోని చినకోండ్రు విశ్వనగర్‌లో 23నుంచి మార్చి 6 వరకు పన్నెండు రోజుల పాటు విశ్వగురు పీఠాధిపతి విశ్వయోగి విశ్వంజీ 80వ జన్మదిన వేడుకలు జరగనున్నాయని విశ్వమానవ సమైక్యతా సంసత్ కన్వీనర్ ఆకుల కోటేశ్వరరావు తెలిపారు.వేడుకల్లో పలువురు ప్రముఖులు హాజరవ్వనున్నట్లు చెప్పారు. శుక్రవారం ఉదయం అంకురార్పణతో విశ్వంజీ వేడుకల్ని ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు. సాయంత్రం హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం. రామచంద్రరావు, ఏపీ మాజీ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ ముఖ్య అతిథులుగా హాజరవ్వనున్నారని కోటేశ్వరరావు తెలిపారు.

కన్నెగంటి సేవలు అసమానం



గుంటూరు వెస్ట్: స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచిత పోరాటం చేసి ఎందరికో ఆదర్శంగా నిలిచిన కన్నెగంటి హనుమంతు సేవలు అసమానమని విశ్రాంత ఎస్పీ చక్రపాణి కొనియాడారు. స్థానిక గుజ్జనగుండ్లలో గురువారం ఏపీ కన్నెగంటి హనుమంతు మెమోరియల్ స్పోర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఆయన 102 వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న చక్రపాణి మాట్లాడుతూ పశువులు తినే గడ్డిపైనా, మేకలు తినే దాణా పైనా బ్రిటిషర్లు పన్నులు వేసి ప్రజల్ని ఇబ్బంది పెడితే దానికి వ్యతిరేకంగా కన్నెగంటి హనుమంతు పోరాడి విజయం సాధించారని తెలిపారు. డాక్టర్ మండల శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎందరో మహనీయుల త్యాగాల ఫలమే మనం అనుభవిస్తున్న స్వరాజ్యమన్నారు. కన్నెగంటి లాంటి మహనీయులను స్మరించుకుంటూ ప్రతి ఏడాది కార్యక్రమాలు నిర్వహిస్తున్న సొసైటీ సభ్యుల్ని అభినందించారు. కార్యక్రమంలో తిరుమలశెట్టి నాగరాజు, సీహెచ్. సురేష్, చిమటా నాగరాజు, టి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సామాజిక వర్గం ఏకీకృతంతోనే అభ్యున్నతి



ఎమ్మెల్యే రోశయ్య, ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లును సత్కరించిన నాయకులు

కాపుల ఆత్మీయ సమావేశంలో శాసనమండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు

పొన్నూరు: సామాజిక వర్గంలో ప్రతి ఒక్కరూ ఒకే ఆలోచన విధానంతో ముందుకు సాగి పేదల అభ్యున్నతికి కృషి చేయాలని శాసన మండలి చీఫ్ విప్ డాక్టర్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని వెల్లలూరు గ్రామంలో గురువారం శ్రీ షిర్డీ సాయినాథ కల్యాణ మండపం నూతన నిర్మాణానికి ఆయనతో పాటు ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ముఖ్య అతిథులుగా పాల్గొని శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కాపుల ఆత్మీయ సమావేశంలో ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు మాట్లాడారు. సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో సామాజిక సమతుల్యత తీసుకురావాలన్న విధానంతో పాలన సాగిస్తున్నారని తెలిపారు. ఎన్నికల్లో సమాజానికి ఉపయోగపడే వ్యక్తుల్ని ఎన్నుకుంటే అనుకున్న ఫలితాలు లభిస్తాయని చెప్పారు. వ్యక్తిపై లేని ఆరోపణలు చేస్తే ప్రజల హర్షిస్తారని అనుకోవడం అవివేకమని, ధూళిపాళ్ల చేసిన ఆరోపణల్లో నిజం లేకపోవడంతో ప్రజలు పిచ్చోడిగా భావిస్తున్నారని విమర్శించారు. ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడుతూ ధూళిపాళ్ల వీరయ్య, నరేంద్ర చేసిన 35 ఏళ్ల పాలనలో చూడని అభివృద్ధిని వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో 57 నెలల్లో ప్రజలకు చేసి చూపించానని స్పష్టం చేశారు. నరేంద్ర హయాంలో గ్రామాల్లో మౌలిక సదుపాయాలు లేక జటిలంగా మారిన సమస్యల్ని రూ.200 కోట్లతో పరిష్కరించామని తెలిపారు. పట్టణంలో రోడ్డు విస్తరణ, చేబ్రోలు వంతెన నిర్మాణంతో ప్రజల దశాబ్దాల కల నెరవేర్చామని తెలిపారు. నరేంద్ర స్వగ్రామమైన చింతలపూడిలో మూడు కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించామని పేర్కొన్నారు. రైతు ముసుగులో సంగం డైరీని కబ్జా చేసి పాడి రైతుల బోనస్‌లు కొట్టేసిన నీచ చరిత్ర నరేంద్రదని విమర్శించారు. అనంతరం స్థలదాత గ్రంధి వెంకటాద్రిని, అతిథులను సత్కరించారు. కార్యక్రమంలో మునిపల్లె పీఏసీఎస్ ఛైర్మన్ కోటా శ్రీనివాసరావు, గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు, బండి శివరామప్రసాద్, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, నిర్మాణ కమిటీ కన్వీనర్ మస్తాన్ రావు, కొఠారి వెంకటరమణ, గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో జనసేన, టీడీపీ నాయకులు చేరిక

పొన్నూరు: ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అందిస్తున్న ప్రజా సంక్షేమ పాలన చూసి నియోజకవర్గంలో చేరికలు కొనసాగుతున్నాయని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. వెల్లలూరు గ్రామంలో గురువారం జరిగిన కాపు ఆత్మీయ సమావేశంలో పొన్నూరు మండలం ములుకుదురు చెందిన జనసేన, టీడీపీ నాయకులు మేకల బాలాజీ, నీలకంఠ శంకరరావు, కొనరాజు రఘు, దేవవరపు నాగేశ్వరరావుతో పాటు పలువురు కార్యకర్తలు శాసన మండలి చీఫ్ విప్ ఉమ్మారెడ్డి వెంకటేశ్వర్లు, ఎమ్మెల్యే రోశయ్య సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

వీవీఐటీ డ్రైవర్‌కు ఉత్తమ అవార్డు



అవార్డు అందుకున్న శ్రీనివాసరావును అభినందిస్తున్న కళాశాల చైర్మన్ విద్యాసాగర్

పెదకాకాని: 35వ రోడ్డ భద్రతా మాసోత్సవాలు ముగింపు వేడుకల్లో వాసిరెడ్డి వెంకటాద్రి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (వీవీఐటీ) కళాశాలకు చెందిన డ్రైవర్ మాడా శ్రీనివాసరావు ఉత్తమ అవార్డును గుంటూరు రవాణా శాఖ అధికారుల నుంచి అందుకున్నారు. గత 16 సంవత్సరాలుగా కళాశాల బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్న శ్రీనివాసరావు అప్రమత్తంగా ఉంటూ విద్యార్థుల్ని సురక్షితంగా ఇంటికి చేరవేసినందుకు గాను నేషనల్ హైవేస్ అథారిటీ పీడీ పార్వతీశం, రవాణాశాఖ ప్రాంతీయ సంయుక్త కమిషనర్ కృష్ణవేణి, గుంటూరు రవాణా శాఖ ఉప కమిషనర్ షేక్ కరీం చేతులు మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. ఉత్తమ డ్రైవర్ అవార్డు అందుకున్న శ్రీనివాసరావును గురువారం కళాశాలలో చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై. మల్లికార్జున రెడ్డి, ట్రాన్స్‌పోర్ట్ కన్వీనర్ పి.వి. సురేందర్ మోహన్, సిబ్బంది అభినందించారు.

కిట్స్‌లో ఆకట్టుకున్న హ్యాకథాన్



హ్యాకథాన్‌లో పాల్గొన్న విద్యార్థినిని అభినందిస్తున్న జ్యూరీ ప్రతినిధి

ప్రత్తిపాడు: వట్టిచెరుకూరు మండలం వింజనంపాడు కిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ విభాగంలో మూడవ సంవత్సరం విద్యార్థులకు 36 గంటల హ్యాకథాన్ నిర్వహించారు. మేక్ స్కిల్ సీఈవో పర్వతనేని మధు బృందం ఆధ్వర్యంలో రియాక్ట్ జేఎస్‌లో జరిగిన హ్యాకథాన్‌లో 38 టీంలు పాల్గొన్నాయి, వివిధ రంగాలకు చెందిన అనేక ఆవిష్కరణలను విద్యార్థులు వర్చువల్ షాపింగ్ ప్లాజా, జ్యూరిఫై, లింక్ గార్డ్, ఏవి చార్జింగ్ పాయింట్స్, వర్చువల్ మేకప్.. వంటి పలు ప్రాజెక్టులను ఆవిష్కరించారు. సాఫ్ట్‌వేర్ సంస్థలకు చెందిన జ్యూరీ ప్రతినిధులు లోకేష్ వంక, మణిదీప్ సాము, సుధీర్.టి, జె. గిరిధర్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ కోయి సుబ్బారావు, కార్యదర్శి శేఖర్, ప్రిన్సిపాల్ డాక్టర్ పి. బాబు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఎం.ఎస్.ఎస్. సాయి పాల్గొన్నారు.

క్వారీ తిరునాళ్లకు పటిష్ట ఏర్పాట్లు

- అధికారులతో సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- ట్రాఫిక్, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచన



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిలారి

చేబ్రోలు: మహాశివరాత్రి సందర్భంగా వడ్లమూడి క్వారీ బాటకోటేశ్వరస్వామి తిరునాళ్లకు వచ్చే భక్తులకు అసౌకర్యం కలగకుండా అన్ని శాఖల అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని శాసనసభ్యుడు కిలారి వెంకట రోశయ్య సూచించారు. దేవస్థానం ప్రాంగణం వద్ద గురువారం తిరునాళ్ల ఏర్పాట్లపై జరిగిన సమీక్షా సమావేశానికి వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, ప్రభల నిర్వాహకులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పండుగ రోజు దర్శనానికి వచ్చే భక్తులందరికీ త్వరితగతిన దైవ దర్శనం జరిగే విధంగా క్యూ లైన్లు ఏర్పాట్లు చేయాలని దేవదాయశాఖాధికారులకు సూచించారు. తిరునాళ్ల రోజు నారాకోడూరు - తెనాలి రోడ్డులో ట్రాఫిక్ సమస్యలు రాకుండా గతంలో లాగా ప్రత్యామ్నాయంగా నారాకోడూరు బైపాస్ రోడ్డు మార్గాన్ని ఉపయోగించాలని తెలిపారు. రహదారికి మరమ్మతులు వెంటనే చేయాలని ఆదేశించారు. మినీ బైపాస్ ద్వారా వాహనాల రాకపోకలు సాగించడం ద్వారా కొంత ట్రాఫిక్ సమస్య తీరుతుందని చెప్పారు. దేవాలయం ప్రాంగణం వద్ద రోడ్డుకు ఇరువైపులా వ్యాపారులు దుకాణాలు పెట్టకుండా ప్రత్యేకమైన స్థలంలో నిర్వహించుకోవాలని సూచించారు. హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్, అగ్నిమాపక శకటం అందుబాటులో ఉంచాలని తెలిపారు. మొబైల్ టాయిలెట్‌లను వీలైనన్ని ఎక్కువ ఏర్పాటు చేయాలని చెప్పారు. అన్ని ప్రభుత్వశాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పని చేసి, ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పంచాయతీ, తాగునీటి, విద్యుత్‌శాఖల అధికారులు చేపట్టనున్న పనుల గురించి సమావేశంలో వివరించారు. తిరునాళ్ల సందర్భంగా ఇప్పటి వరకు తీసుకున్న పనులు, చేపడుతున్న కార్యక్రమాల గురించి ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ముందుగా బాల కోటేశ్వరస్వామి దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఎం. అనితారాణి, దేవదాయశాఖాధికారి పోతుల రామకోటేశ్వరరావు, ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి, డీసీఎంఎస్ డైరెక్టర్ కుర్రా పాములు, సొసైటీ అధ్యక్షుడు చందు సాంబశివరావు, కె. కిరణ్, పంచాయతీ కార్యదర్శి వై.పి.ఏ.ప్రసాద్ పాల్గొన్నారు.

వలంటీర్ల సేవలకు సెల్యూట్

ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



వలంటీర్లకు వేదికపై సెల్యూట్ చేస్తున్న బలసాని కిరణ్‌కుమార్, నాయకులు

ప్రత్తిపాడు: ప్రభుత్వానికీ, ప్రజలకు మధ్య వారధిగా వలంటీర్లు ఉన్నారని ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ అన్నారు. నియోజకవర్గ కేంద్రంలోని పమిడి గ్రౌండ్స్‌లో గురువారం వలంటీర్లకు వందనం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన బలసాని తొలుత దివంగత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్. రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రార్థన గీతం అనంతరం వలంటీర్లు చేస్తున్న సేవలకు గాను వారికి సెల్యూట్ చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్తిపాడు మండలంలోని సేవా మిత్ర, సేవా వజ్ర, సేవా రత్నలుగా ఎంపికై న వలంటీర్లను దుశ్శాలువా, మెమెంటోలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వలంటీర్లు ఎంతో సేవాదృక్పథంతో ముందుకు సాగుతున్నారని చెప్పారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వలంటీర్ వ్యవస్థ ద్వారా నేరుగా లబ్దిదారుల గడపకే సంక్షేమాన్ని చేరవేస్తున్న నాయకుడు జగన్‌మోహన్‌రెడ్డి అని తెలిపారు.

అద్వితీయ మెజారిటీతో పట్టం కట్టాలి

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలంతా మరోసారి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అద్వితీయ మెజారిటీతో పట్టం కట్టాలని, ఆ దిశగా ఊరూరా, ఇంటింటికీ వెళ్లి విస్తృత ప్రచారం చేయవలసిన బాధ్యత పార్టీ నాయకులు, కార్యకర్తలందరిపైనా ఉందని బలసాని తెలిపారు. ఇప్పటికే ప్రజలు ఓటుతో ప్రతిపక్షాలకు తగిన రీతిలో సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, వారిని మరింత చైతన్యవంతుల్ని చేయాల్సిన బాధ్యత భుజస్కంధాలపై పెట్టుకోవాలని కోరారు. పెత్తందారులకు, పేదలకు మధ్య జరగనున్న ఎన్నికల సంగ్రామంలో జగనన్నతో పాటు తనను ఆశీర్వదించాలని విన్నవించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాసరి అన్నమ్మ, వైస్ ఎంపీపీ షేక్ అఫ్రినా సుల్తానా, సర్పంచులు కాసు పద్మావతి, లాం రత్నకుమార్, ఎంపీటీసీ సభ్యురాలు బి. సువార్తమ్మ, మండల కన్వీనర్ కట్టా సుబ్బారావు, రైతు విభాగం జిల్లా కన్వీనర్ ఓం ప్రకాష్‌రెడ్డి, సేవాదళ్ జిల్లా కన్వీనర్ మురళి, సచివాలయాల మండల కన్వీనర్ వి. లక్ష్మారెడ్డి, సొసైటీ ప్రెసిడెంట్ పరమేశ్వరరెడ్డి, మార్కెట్ యార్డు డైరెక్టర్ సీహెచ్. లక్ష్మణ, నాయకులు వాడపల్లి ఫ్రాన్సిస్, ఏసు, సుబ్బారావు, జి. శ్రీనివాసరెడ్డి, చెంచు రామారావు, మండల పరిషత్ కార్యాలయ సూపరింటెండెంట్ రామకోటయ్య, ఈవోపీఆర్డీ మోషే, ఏపీఎం సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

మాట తప్పని, మడమ తిప్పని సీఎం జగన్



కళ్లజోళ్లు అందుకున్న గ్రామస్తులతో అంబటి మురళీకృష్ణ

- బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ
- నంబూరులో 693మందికి కళ్లజోళ్ల పంపిణీ

పెదకాకాని: రాష్ట్ర విభజన, కరోనా వైరస్ కష్టకాలంలోనూ ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా సంక్షేమ పథకాల అమలు చేయడంలో మాట తప్పని, మడమ తిప్పని ఏకైక ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్ రెడ్డి అని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ అన్నారు. పెదకాకానిలో వరుసగా రెండవ రోజు గురువారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళ్లజోళ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ అణగారిన వర్గాల సాధికారిత, సంక్షేమ పథకాలు అందించడం ప్రభుత్వాల కనీస బాధ్యతని రాజ్యాంగం చెబుతోందని తెలిపారు. దానికి అనుగుణంగా ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చుతూ, ప్రజా రంజక పాలన అందిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్మోహన్‌రెడ్డి స్ఫూర్తితో తాము ప్రజాసేవలో ముందడుగు వేస్తున్నట్లు ప్రకటించారు. బజరంగ్ జగన్నామ సంక్షేమంలో భాగంగా ఈనెల 12న పెదకాకానిలో నిర్వహించిన బజరంగ్ నేత్రజ్యోతిలో పాల్గొన్న గ్రామస్తులు 693 మందికి కళ్లజోళ్లు అవసరమని డాక్టర్లు నిర్ధారించినట్లు తెలిపారు. డాక్టర్ల సూచనల మేరకు వాటిని పంపిణీ చేసినట్లు మురళీకృష్ణ వివరించారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచి ఆళ్ల వీరరాఘవమ్మ, జెడ్పీటీసీ సభ్యులు గోళ్ల జ్యోతి, బత్తుల అనురాధ, కర్లపూడి రమేష్, స్థానిక నాయకులు వీర్ల వీరాంజనేయులు, ఆలా శ్రీనివాసరావు, దానబోయిన నాగేశ్వరరరావు, ముడియాల మల్లికార్జునరెడ్డి, సుంకర నర్సిరెడ్డి, సుంకర కృష్ణారెడ్డి, ఆలపాటి రాఘవ, బి. కిషోర్, అప్పసాని చంద్రశేఖర్, కిలారి రాము, వుయ్యూరు సతీష్‌రెడ్డి, షేక్ ఆరిఫ్, షేక్ నజీర్ అహ్మద్, కుక్కల రాంప్రసాద్, తాడిబోయిన వేణుగోపాలరావు, కేతినేని ప్రసాదరావు, నీలం నాగయ్య, దూపాటి వెంకట్రావు, కాకాని సాంబశివరావు పాల్గొన్నారు.

వెల్లలూరు గ్రామ అభివృద్ధికి కృషి

కొరిటిపాడు(గుంటూరు): వెల్లలూరు గ్రామ అభివృద్ధికి కృషి చేస్తామని బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. గ్రామంలో శ్రీ షిర్డీ సాయినాథ కల్యాణ మండపానికి గురువారం భూమిపూజ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ తన స్వగ్రామం మామిళ్లపల్లిని ఆనుకొని ఉన్న వెల్లలూరులో కల్యాణ మండపం భూమిపూజలో పాల్గొనడం ఎంతో సంతోషకరమని పేర్కొన్నారు. గ్రామ అభివృద్ధిలో ఫౌండేషన్ పాలుపంచుకుంటుందన్నారు. ఇప్పటికే ఈ గ్రామంలో జగన్నామ సంక్షేమ సంవత్సరం కింద ఉచిత కళ్లజోళ్లు పంపిణీతో పాటు గుండె పరీక్షలు, యాంజియోగ్రామ్‌లు చేయించినట్లు చెప్పారు. వెల్లలూరు గ్రామ నాయకులు బండి శివరామకృష్ణ ప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు అంబటి రాఘవ, గ్రామ సర్పంచ్ ఇక్కుర్తి మల్లికార్జునరావు తదితరుల కోరిక మేరకు తోడ్పాటును అందిస్తామని ఆయన వివరించారు.

యువతలో సేవా భావం అవసరం

గుంటూరు ఎడ్యుకేషన్: యువతలో సేవా భావం ఎంతో అవసరమని ప్రభుత్వ మహిళా కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె. సుబ్బరత్నమ్మ పేర్కొన్నారు. సాంబశివపేటలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆధ్వర్యంలో కృష్ణబాబుకాలనీలో నిర్వహిస్తున్న ప్రత్యేక సేవా శిబిరం ముగింపు కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బరత్నమ్మ మాట్లాడుతూ వారం రోజుల శిబిరంలో భాగంగా మొక్కలు నాటడం, స్వచ్ఛతా సేవ, వైద్య శిబిరం, సరైన జీవన విధానం, పరిశుభ్రతపై అవగాహన ర్యాలీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా ఎన్ఎస్ఎస్ నిర్వహణ అధికారి జేవీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ యువత చదువుతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు.

సంక్షేమం, అభివృద్ధి జగనన్నకు రెండు కళ్లు

- సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్
- తురకపాలెంలో గుండె గుండెకు జగనన్న-గడప గడపకు కిరణన్న నిర్వహణ



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: సంక్షేమం, అభివృద్ధి జగనన్నకు రెండు కళ్లని పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని తురకపాలెంలో గురువారం ఎంపీపీ ఇంటూరి పద్మావతి ఆధ్వర్యంలో నిర్వహించిన గుండె గుండెకు జగనన్న...గడప గడపకు కిరణన్న కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులు, ప్రజలు ఘన స్వాగతం పలికారు. అనంతరం అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక దేవాలయాలు, చర్చిల్లో ప్రత్యేక పూజలు, ప్రార్థనలు చేశారు. అనంతరం గ్రామంలో ఇంటింటికీ వెళ్లి, ప్రజలతో మాట్లాడారు. ఆడబిడ్డల మోములో చిరునవ్వులు చూసేందుకు మీకు తోడుగా అక్కడ జగనన్న ఉన్నాడని.. ఇక్కడ మీకు అండగా ఈ కిరణన్న ఉన్నాడని భరోసా కల్పించారు. చంద్రబాబు ప్రభుత్వంలో జన్మభూమి కమిటీల పేరుతో ప్రజల్ని మోసం చేసిన వైనాన్ని వివరించారు. జగనన్న పంపితే సామాన్యుడిగా మీ ముందుకొచ్చానని, ఆశీర్వదించాలని కోరారు. జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేసుకునేందుకు, ప్రత్తిపాడు నియోజకవర్గంలో వైఎస్సార్ సీపీని అఖండ మెజారిటీతో గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పని చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తుమ్మల సుబ్బారావు, సర్పంచ్ సూర్యప్రకాశరావు, భాస్కరరావు, నాగిరెడ్డి, కార్పొరేషన్ల డైరెక్టర్లు పిల్లి మేరీ, కందుకూరి జ్యోతి, బొల్లెద్దుల వెంకట్, సర్పంచులు ఎదురుపాక వెంకట్, ఆరుదల సాంబశివరావు, వైఎస్సార్ సీపీ సేవాదళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, కార్పొరేటర్ ఏరువ సాంబిరెడ్డి, తంగెళ్ల నాగేశ్వరరావు, రజనీకాంత్ పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే సమాజ సేవ అలవర్చుకోవాలి

గుండవరం(చేబ్రోలు): విద్యార్థి దశ నుంచే సమాజ సేవ అలవరుచుకోవాలని చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి సూచించారు. మండలంలోని గుండవరంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు వారం రోజుల పాటు నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరం గురువారం ముగిసింది. విద్యార్థులు పారిశుద్ధ్యం, పరిశుభ్రత, మెడికల్ క్యాంప్, పచ్చదనం, మొక్కలు నాటడం, నీటి వినియోగం, మూఢ నమ్మకాలపై చైతన్యం, పౌష్టికాహారం, ఆరోగ్యం వంటి అంశాలపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. చివరి రోజు గ్రామంలో ప్రజల సామాజిక, ఆర్థిక సర్వే నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ స్పెషల్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చుక్కా సాయి నాగేంద్రమ్మ మాట్లాడుతూ సమాజ సేవలో విద్యార్థులు ముందుండాలని సూచించారు. సేవాతత్పరత కలిగిన విద్యార్థులే ఉత్తమ పౌరులుగా రాణిస్తారని తెలిపారు. దేవదాయశాఖ ఈవో పోతుల రామకోటేశ్వరరావు మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ క్యాంప్‌ల ద్వారా విద్యార్థులకు సమాజంపై అవగాహన పెరుగుతుందని చెప్పారు. అనంతరం ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీవో పి. శ్రీనివాసులు, చుక్కా నాగేంద్రబాబు, షేక్ సుభాని, పి. ప్రసాదరెడ్డి, హనుమంతరావు పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం



పట్నంబజారు: ప్రార్థించే పెదవుల కన్నా.. సాయం చేసే చేతుల మిన్న అని శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి చెప్పారు. పాత గుంటూరులోని పేద కుటుంబానికి చెందిన దేవులపల్లి లాస్య కంచిలోని శ్రీ చంద్రశేఖరేంద్ర సరస్వతి విశ్వ మహా విద్యాలయంలో బీటెక్ ప్రథమ సంవత్సరం చదువుతోంది. ల్యాప్‌టాప్ కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్న పరిస్థితుల్లో స్ఫూర్తి ఫౌండేషన్ ప్రతినిధి, అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్ చొరవ తీసుకుని రూ. 20వేలను విప్ అప్పిరెడ్డి చేతుల మీదుగా అందజేశారు. బృందావన్ గార్డెన్స్‌లోని విప్ కార్యాలయంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ చదువుకు పేదరికం అడ్డుకాకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాల్ని విద్యార్థుల కోసం అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. కార్యక్రమంలో స్ఫూర్తి ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

దళిత, ఆదివాసి మేనిఫెస్టో విడుదల



ఏఎన్‌యూ: దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ (డీబీఆర్‌సీ) రూపొందించిన దళిత ఆదివాసి మేనిఫెస్టో 2024ను నాగార్జున విశ్వవిద్యాలయ వీసీ పి. రాజశేఖర్ గురువారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత, ఆదివాసి స్థితిగతులపై అధ్యయనం చేయటం ఎంతో అభినందనీయమన్నారు. డీబీఆర్‌సీ ఏరియా కోఆర్డినేటర్ వి. భగవాన్‌దాస్ మాట్లాడుతూ రాష్ట్ర జనాభాలో 25 శాతంగా ఉన్న దళిత, ఆదివాసి ప్రజల ఆకాంక్షలకు అక్షర రూపంగా మేనిఫెస్టోను రూపొందించినట్లు చెప్పారు. దళిత గిరిజనుల అభివృద్ధికి రాజకీయ పార్టీలు పొందుపరచవలసిన అంశాలైన విద్య, ఆరోగ్యం, ఉపాధి, భూమి, ఇల్లు బడ్జెట్, సామాజిక భద్రతలకు సంబంధించిన విషయాలను మేనిఫెస్టోలో పొందుపరిచామని తెలిపారు. కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ కుమార్ రాజా పాల్గొన్నారు.